"కుక్కురోకో.... కొక్కురోకో.... కుక్కుకుక్కుకూ్క"
వడికొప్పెక్కి సాము చేసే యిల్లరికపుటల్లుడిలా గంపెక్కి కూస్తోంది కోడి.

# క్రూక్ వాక్

యం. రామకోటి

దిగజార్చిన రెక్కలు బుంగలా పొంగించి గుబురుదేరి గాలి వాటుకి విరబోసిగే ముద్ద చామంతిలా చిందులేస్తోంది.

"కొక్కురోకో.... కొక్కురోకో...."

జున్నుముక్కలా దిగజారుతోంది నెలవంక.

టర్కీలు, గిన్నీలు, కక్కెరలూ, చిమటలూ దొక్కలెగరేసుకుంటూ గూళ్ళలోంచి బయటబడుతున్నాయి.

గుసగుసలాడుకుంటూ గుణగుణసొణుగుకుంటూ గుంపులు గుంపులుగా గుమిగూడుతున్నాయి.

"కుక్కుక్కుకుక్కు .... కుక్కురోకో కొక్కురోకో...." రెట్టించి కూస్తోంది కోడి.

వేళ కాని వేళయేమిటీ కూత అని తెలతెలబోతున్నాయి గుంపులు. కళ్ళవంతా కోళ్ళమయం. మెడలు రిక్కించి మరీ చూస్తున్నాయి.

"మూడు వేదాలు, ముక్కోటి పురాణాలు.... యీ మూడు ముక్కల్లోనే వున్నాయి కొక్కురోకో...."

"కొత్త కొత్త పలుకులు. అలా ఎవరన్నారేం?" గుంపులు కుక్కుకూ్క అన్నాయి.

"నేనే అంటున్నాను.... మరొకరు చెప్పాలా? కొక్కురోకో" ఉస్సురని.

"ఆధారం లేకుండా కూస్తున్నానను కోకండి. వెనకటికి ఆంధ్రకవితా పితామహులు యీ గూఢార్థంచెబుతూనే మమకారంతో మనమీదో పద్యం సెలవిచ్చేరు. 'సకలాశాగతి' అంటూ మొదలెట్టి వేదాలకి మూలం మన కూతలోనే వుందని విపులంగా చెప్పేశారు.

"ఆయనెవరు?" మెడ కింద వేలాడే యెర్రముంజ సడలించిందో పుంజు.

"అల్లసాని పెద్దనగారనీ.... అందరికీ ఆ కూత చేతనవుతుందా. అందరూ ఒకే లాగ కూయలేరు. కూతంటే మంత్రంలా పఠైయ్యాలి ముమ్మారు కంఠం వారగాలి ఒత్తి పలకాలి. గొంతుక సవరించడంలో కొండె కదిలించడంలో సమయానుకూలంగా ఆ మూడు ముక్కలే రకరకాల అర్థాలుస్ఫురింపించాలి. ఆ సత్తువ కూతలో వుండాలి. ఆ విద్య అందరికీ దక్కదు. కొందరికే" రాటుదేరిన సంపెగ మొగ్గలాంటి ముక్కువంచి రెక్కమీద సాపు చేసుకుంటోంది.

చిగురించే వయసులా తలమీద నూనూగు యెర్రజుత్తు మొలకలెత్తుతోంది. మెడ కింద ముంజ యిప్పుడిప్పుడే దిగుతోంది.

బిత్తరపోయి చూస్తున్నాయి కోళ్ళు.

మసగ వెన్నెల వెలిబూడిద వెదజల్లుతోంది.

"పెట్టనెత్తిమీద జుత్తు మొలుస్తోందే. యిదేం విడ్డూరం అందుకేలా వుంది కూత నేర్చింది

పుంజుల కొండిలు జవజవలాడేయి. జూళ్ళు దిగజారిపోయి ముడుచుకుపోతున్నాయి.


"దీనికి కొండెలా మొలిచిందనా? కుక్కుకూ్క...." గుసగుసలు విని వెక్కిరించింది గంపమీద పెట్ట.

బిక్కుబిక్కుమంటూ చూసేయి కోళ్ళ గుంపులు.

"అది నా గుండెల్లో కుములుతున్న మంట. అగ్గిసెగ. ఆ నివురులో కాకలు దేరింది నా తెలివి. మేలిమిసలాకలా పొటమరిస్తోంది. యీ మాత్రం యెరగరా? కొక్కురోకో. అందుకే కవి సార్వభౌముదేవన్నాడంటే...."

"ఆయనెవడు ఏమన్నాడు?"

"శ్రీనాధుడనీ ఒకడుండేవాడులెండి.





ఏవన్నాడో తెలుసా?" ఉత్త అలగా జనం అని గ్రీ వళ ఓమారు విసుక్కుని.

"కపాలాన్ని చించుకుని పైకి రేగేకోప జ్వాల అన్నాడు. కుక్కుకూ .... యీ .... పెట్టకి వివరాలన్నీ ఎలా తెలుసను కుంటున్నారేమో కొక్కురోకో.... పుట్ట గానే పువ్వు పరిమళిస్తుందంటారు. పుడు తూనే పట్టిపట్టి మరీ రకరకాలుగా కూసే వట. పెట్టేవిటీ కూతేవిటీ అని కోళ్ళన్నీ ముక్కుమీద రక్కుకున్నాయట. అది చూసి మా నాన్నపుంజు మురిసిపోయేట్ట. పలుకు తీరుచూసి నాకు కృకవాకం అని పేరు పెట్టేట్ట. కళ్ళు తెరిచేనో లేదో వున్నవీ లేనివీ అన్నీ నూరిపోసేసేడు నాకు. ఆయనకెలా తెలుసంటారేమో.... అసలు మామూలు పుంజుగారెవరనుకున్నారూ?"

మెడలెత్తి చూసేయి టర్కీలు.

"తామ్రచూడులు"

"వాళ్ళెవరూ?" అన్నాయి కోళ్ళన్నీ.

"సోలమను చక్రవర్తిగారి సింహాసనం మీద వెల్ల గొడుగులా రెక్కలు చాచి ఏం చెయ్యాలో, ఎలా మాట్లాడాలో రాజరికంఎలానడిపించాలోనిత్యం చెవిలో గూడుకట్టుకుని మరీ చెబుతుండేవారు. ఆ పుంజుగారి సంతతి మేం. అందుచేత అన్ని భాషాలూ,ఏసలూ,శబ్దాలూ అర్థాలూ మాకు అకళింపుకొచ్చేసేయి. ఆ సార వంతా తరతరాలుగాకాసివడబోసి కలబోసి ముచ్చటగా మూడు అమృత గుళికలు తయారుచేసేం. మూడే ముక్కలు. అన్నీ అందులోనే వున్నాయి. కొక్కురోకో. మేం వేసేది తంత్రం. కూసేది మంత్రం. ఆ స్వరం వింటేనే తూరుపుతలుపులుతెరుస్తుంది. సూరీడుకిసంకెళ్ళు విడతాయి. లోకానికి పొద్దు పొడుస్తుంది....లేకపోతేఅంతా చిట్టచీకటే. చూడండినాకూతతోనా కొండి కంపిస్తుంది. దాంతో గాలి కదుల్తుంది. చుక్కలు పొడుస్తాయి. కూతనిబట్టిరెక్కలు తెగి రాలిపోతాయి. మా వంశం చలవవల్లే మన జాతికి యీ మూడు ముక్కలూ అబ్బేయి."

"ఎక్కడున్నా మన వాళ్ళు యిలాగే కూస్తారా?"

"శబ్దంలో చిన్నచిన్న సవరణలుంటాయంతే. కొందరు 'కుకిరూకో' అంటారు. కొన్ని చోట్ల 'కొకురూకో' అంటారు. మరి కొందరు. 'కాకెడూడిల్డూ'అంటారు. పలుకుబడి తేడాగాని భావమొక్కటే. పొద్దు పొడుస్తోంది. మొద్దునిద్దర చాలించండ్రా. పనుల్లోకి పొండ్రాఅని.... అంటే మనం లోకానికి పంచాంగం చెప్పే పురోహితులం."

అర్థరాత్రి అంకమ్మ శివాలు చూపికలవరబడుతున్నాయి కళ్ళంలో చేరిన కోళ్లు. పెట్ట బరువుకి గంపలో యిరుక్కుపోయిన కోళ్ళు పైకి రావాలని గిలగిల తన్నుకుంటున్నాయి.

అది కనిపెట్టిన పెట్ట గోళ్ళన్నీ వంగ జాచి గంప గళ్ళలో అదిమిపట్టి అణగ దొక్కింది.

యిన్ని కూతలెక్కడ నేర్చిందిరా అని బూతు లాడుకుంటున్నాయి టర్కీ పుంజులు. చిటపటలాడుతున్నాయి చిమటలు. కళ్ళు చికిలిస్తున్నాయి కక్కెరలు. కన్నెర జూస్తున్నాయి ఎర్ర పుంజులు.

"కుక్కుకుక్కు.... కొక్కురోకో ....కుక్కుకుక్కు" ధనుష్టంకారంలా కొండె టంటంలాడించింది పెట్ట.

గుప్‌చుప్ అయిపోయేయి కోళ్ళన్నీ.

"సోలమనురాజుగారు కన్నుమూసేరు. మామూలు పుంజుగారు తెరమరుగై




పోయేరు. బుద్ధి బుర్రలో దాచుకుని పొట్ట చేత్తో పట్టుకుని సుమేరు సీమకు వీడు కోలు చెప్పేసేరు. నానాయాతనలూ పడి యెలాగైతేనేం కాశ్మీరం చేరుకున్నారు. కనుచూపుమేర పచ్చగా నేల యెదు రొచ్చింది. గింజలు జల్లి యవలు పండిం చుకుని మళ్ళీ భూమి దున్ని పొట్టపోసు కుంటున్నారు పొంచి పొంచి యీ తతం గాన్ని దేవరాజు చూసేడు. వజ్రభూమిని దున్నేడు. నమ్మవట్టి గింజలేసేడు. నేల కళకళలాడింది....అది చూసి ఆ జనం మురిసిపోయేరు. దాన్నే వాళ్ళ భాషలో 'సహల్యాతే హల్యాః' అని మైమరచి పలకరించేరు. అదీమా ముత్తాత ముక్కులో లో స్వరబద్ధం చేసి 'కొక్కురోకో' అన్నా రట. అది మంత్రంలా మోగింది ఆ కూత వినగానే పొద్దు పొడిచేది భూమి పండేది. తిండి దొరికేది- యింకే వుందీ అసలే ఆ దేవజనం పట్ట పగలే కలలు కనే జాతి. అన్నీ వింతలే వాళ్ళకి కథలల్లే సేరు. గౌతముడూ.... అహల్యా.... దేవ రాజూ.... రంకూ, బొంకూ అన్నీ కలగా పులంగ చేసి ఓ పెద్ద రామాయణం రాసే సేరు. చివరకి మనమీద అపవాదు వేసేరు."

"మనవేం చేసేం మధ్యనా."

"ఆ దేవరాజుమన రూపంలోనేకథలో రంకు చేసేడు"

"ఓరి వీడి జిమ్మడిపోనూ" అందో పెట్ట.

"ఏం జాతో ఆ దేవజాతి.యిది చాలక వాళ్ళలో ఒకడు మన రూపం దిద్దు కున్నాడు. మనని వాళ్ళు కుక్కుటాలని కూడా అంటారు.

ఆయన కుక్కుటేశ్వరుడుగా వెలి సేడు....పుంజులా మహరాజులా పూజ లందుకుంటున్నాడు.... ఏవనో తెలుసా?"

"ఏవనీ?"

"అహల్యాజారాయా అని."

"ఆఁ!" ముక్కులు వెల్లబెట్టేయి కోళ్ళన్నీ.

"మనవేంపావం చేసేవని చెప్పండి.... ....మనకీ మచ్చ దాపురించింది?.... యిలాంటి అన్యాయాలెన్నో నా మనసుని దోఁచేస్తున్నాయి" బాధపడిపోతూ జాలిగా చూసింది పెట్ట గంపని అదిమి పట్టుకుంటూ.

"మాకేవేనా సీలాగ నెత్తిన జుత్తు మొలిచిందా... యీ మోసాలన్నీ తెలియ డానికి.... మాకేం తెలుసు" గౌరవంగా మొరలెత్తి చూసేయి పెట్టలన్నీ.

"ఇంతకీ మిమ్మల్నెందుకు పిలిచేనను కుంటున్నారూ?"

"అది విందావనేగదా.... యీ సేవ" అనుకున్నాయి పుంజులన్నీ.

"ముందుగా మా వంశం.... మా కథా చెప్పనివ్వండి.... అప్పుడుగాని చెప్పినా మీకు బోధపడదూ...."

"అలాగే చెప్పు....చెప్పు చెప్పు" హరికథ వినబోయే జనంలా గంప చుట్టూ గుమిగూడిపోయేయి కోళ్ళన్నీ. పెట్టలన్నీ ముందు చేరిపోయేయి.

"ఆ కొండపేరు క్రౌంచం. దానిమీద ఓ రాకాసిగాడు కాపుకాసి దారినపోయే వాళ్ళని అం అం అని మింగేస్తున్నాడు.. మనమీద బురద జల్లేరేదేవ జనం.... వాళ్ళు కచ్చలు సద్దుకుని వుడాయించేరు... ఎంత దూరం పారిపోగలరు? అందుచేత అంతా గూడుపుఠాణీ చేసి చేవ దేరిన మగాడి కోసం వెదికేరు. మంచు కొండల మీద బండలు దొర్లిస్తున్న కుర్రాణ్ణి చూసేరు. కండలు తిరిగిన కుర్రాడు.... కుమారా అని పిలిచేరు కండలు నిమిరేరు. బుజ్జగించేరు. పొగిడేరు పొంగించేరు.... మొత్తంమీద ఆ కుర్రాణ్ణి ఒప్పించేరు.... కాని....


ఎలా అన్నాడు కుర్రాడు.

ఏం అన్నారు వాళ్ళు.

రాకాసిగాడు కొండలమీద ఎగురు తున్నాడు.... నేలమీద సాము చేసేం ప్రయోజనం అన్నాడు.

ఎగిరే వాహనం కోసం గాలించేరు.మా ముత్తాత దొరికేడు లోకకళ్యాణం కోసం కదా అని సరేనన్నాడు. కుమారస్వామిని వీపుమీదెక్కించుకుని రివ్వున ఎగిరేడు. రాకాసిగాడి తలమీద ఎగిరి తన్ని నెత్తి మీద గిరికీలుకొట్టి గరిడీలు చేసి గోళ్ళతో రక్కి ముక్కుతో పొడిచి పొడిచి వాడితో రక్తం కక్కించేడు. ఠారుమని చచ్చేడు రాకాసి. కుమారస్వామి మళ్ళీ మంచు కొండలమీదికి వెళ్ళిపోయేడు. ఆ తరవాత మా ముత్తాతకి ఆ దేవ జనం 'కుమార వాహనా' అని ఓ బిరుదిచ్చి మంచి మాటలు చెప్పి పొలిమేర దాటించేసేరు. ఆ ముసలాయన ఆ వయసులో బిరుదు మూటగట్టుకుని ఏళ్ళూ వూళ్ళూ దాటి చివరకి భరద్వాజులు వారి ఆశ్రమం చేరు కున్నారు. అప్పటికే చిదిగిపోయిన సంసారంలా వుంది. సాలిగూళ్ళూ.బొమ్మ చెముళ్ళూ. జిల్లేళ్ళూ. ముళ్ళదొంకలూ. చీపురు తుప్పలూ. మొగిలి దుబ్బులూ. పుట్టలూ.... జడుసుకోలేదు మా ముత్తాత ....అన్నీ నరికి చదును చేసి లోగిలంత గూడేసుకున్నాడు. జాతికోళ్ళని కూడ గట్టుకుని దివాణం పెంచుకుని కొలువు దీర్చుకున్నాడు.... కష్టార్జితం...." గుస గుసలు విని ఆగింది పెట్ట.

"యీ నడి జాము కూతలెందుకూ....




వేళకాని వేళ యీ కొలువెందుకూ" అన్నట్టు చూస్తూ నోరు మెదపలేక వుండి పోయేయి గుంపులన్నీ.

చూపుల్లో పసిగట్టేసింది గంపమీద పెట్ట.

"ఉత్తనే నోరెందుకు చించుకోవాలి? ....కంఠశోష మిరియాలు దండగా కుక్కుకు....క్కూ" అలిగింది పెట్ట.

"అమ్మమ్మా.... ఎంత మాటా.... ఒరే పిల్ల సన్నాసులూ.... నోరు ముయ్యండి" అని పిల్లకోళ్ళని గద్దించేయి కోళ్ళన్నీ.

"తరువాత మా తాతతరంలో దివాణం అయిపోయింది.... దేశాలన్నీ తిరిగి చూసొచ్చాడేమో....కోళ్ళఫారంగామార్చేసేడు. తామరతంపరలా పిల్లా పాపలతో ఫారం కళకళలాడిపోయింది. ఆయనకి జాతి భేదాలూ నియమాలూ చాదస్తాలూ లేవు. ఆ గొప్పదనం చూసి ముగ్గురు పెళ్ళాలొచ్చారు. పెద్ద పెట్ట పట్టపురాణిలా వుండేదట.... నిండుకుండ వరసంలో కూడా తొణికేది కాదట.

'అందుకే వండంటి పుంజుని కంది' అనేవాడు మా తాత తరవాతావిడ ఎర్రగా, బొద్దుగా చిలగడదుంపలా వుండేది. అదీ యిదీ లేదు యే పుంజు కనబడినా మెలికలు తిరిగిపోయి కళ్ళు ఓ తెగ తిప్పేసుకునేది. మా తాతకి దాని వాలకం చూసి గంగవెర్రులెత్తి పోయేది.... అయినా దానికి మా తాతంటే మహా మోజుండేది.

'అన్నీ వెకిలి బుద్ధులే.... గిడసల్లాంటి పెట్టల్ని కంది' అనేవాడు మా తాత.

మూడోది ముచ్చటగా అచ్చు ముత్తైదులా వుండేది ఎలా వల్లో పడిందో కాని వెర్రిబాగుల్దీ....మందమతీ.... గుడ్లెక్కడ పెట్టిందో మరిచిపోయి మరో పెట్ట గుడ్ల మీద కూచుండిపోయేది. దాంతో తగువులూ అల్లర్లూ- రచ్చలూ రాద్ధాంతాలూ.. రక్కులు కూతలూ.... మా తాత పిచ్చెత్తిపోయేవాడు.... ఓ మారేం జరిగిందో తెలుసా?.... గూడెంలో రకరకాల జాతులుండేవి.... యీ పిచ్చి మారాణి గుడ్లు పొదిగేసింది. పెంకు లెగదోసుకుని.... మాయకారుతుండగానే ఆ గుంటముండలు తప్పటడుగు లేసుకుంటూ ప్రక్కనున్న ఏట్లో దిగిపోయి యీదడం మొదలెట్టేయి తల్లిపేగా మరోటా మామామ్మ గుండాగిపోయింది.

"కాకుల గూళ్ళలో కోయిలలూ .... కోళ్ళ గూళ్ళలో బాతులూ....యివన్నీ అల వాట్లోపొర బాట్లే..బాతులే పిచ్చిమొహవా.. మనపిల్లలుకావే" అని నిబ్బరంగాచెప్పేడు మా తాత.అప్పుడుగాని తేరుకోలేదు పిచ్చి మారాణి. 'మట్టిబుర్రలు.. అందుకే మీకు చూడం మొలవదు" అన్నాడు.

సిగ్గుపడిపోయిందా చిన్న మారాణి;

పుట్టుకతోనే మాకన్నీ పుట్టుకొస్తాయి. ఆ తెలివితేటలే నెత్తిమీద అలా అంకురిస్తున్నాయి. అలాంటి జుత్తు అందరికీ మొలుస్తుందా ? ఆ రంగూ ఆ లేవడతనం సమయానుకూలంగా మారే కరుకుతనం.. మీ జుత్తుకుందా?.. అది మా సొంతం. ఆ కిరీటం మావంశంలోనే పుట్టు.కొచ్చింది. మీకూ వుండొచ్చుజుత్తు..కాని నా కొండి తున్న చేవవుందా.. చూసుకోండి."

కంపించిపోయింది కోళ్ళగుంపు

"మాలో మవ్వేపుంజుని..నిన్ను పెట్టె వరన్నారు?.. పందెం పుంజుని.. మేం కూతే మరిచిపోయేం. మాకూ వున్నాయి పింఛాలు ఎందుకూ? రొయ్యకు లేవూ బారెడు........ కుక్కుకూ్క" ముక్తకంఠంతోముక్తాయిస్తూ గంప చుట్టూ చేరిపోయేయిపుంజులన్నీ. మెడలమీద జూలుదిగదువ్వుకుంటూ.

పథకం పారింది. నిబ్బరంగా నిలదొక్కుంది పెట్టగంపనెగరగొట్టి బైటపడాలోపలికోళ్ళు యెగిరెగిరిగిలగి తన్నుకుంటున్నాయి.

"ఇప్పుడెందుకు పిలిచేనంటే" పంజా విప్పిపంగచాచి గంపని అదిమిపట్టింది.


చురకత్తిలాంటి ముక్కుని మెడజూలు మీద సానబడుతోంది. "అది విందామనే యీ జాగరం" పిల్లకోళ్ళు వుండబట్టలేక పోయేయి.

జూళ్ళుదించుకున్న పుంజుల్ని చూసి ముసిముసి నవ్వులు నవ్వుకున్నాయి పెట్టలు. వయసు మళ్ళినవి తలొంచుకున్నాయి.

"మిన్ను విరిగి మీదపడుతోందర్రా.. మన జాతికి మహమ్మారి దాపురిస్తోంది.. యింకే వుంది.. సర్వనాశనం.. మన్నూ మశానం"

కంగారుపడిపోయింది గంప చుట్టూ గూడిన గుంపు."అనకాపల్లినూకాలమ్మ- ఎలమంచిలి మారెమ్మ..యిజీనారం పైడితల్లెమ్మ..కలకత్తా కాళెమ్మ.. మరోచోట మహంకాళెమ్మ.. యీ అమ్మవార్లకి ఉపారాలూ సిరిమాను సంబరాలూ మనకిప్రాణ సంకటాలూ....పేరు అమ్మవారిదే సంబ్రం అయ్యలదే.. పుడ్డింగులూ.. పలావులూ కబాబుబిరియనీలూ.. టండూరీ.. జింజర్ చిల్లీ.... పిజిల్లు . రోస్టెడ్.. చికెన్.... చికెన్ .... చికెన్ .... చికెన్.... పొయ్యిపెగల్లో.. సలసలకాగే పెనాల్లో కుమ్ములువేపుళ్ళ మనం. పిల్లా పాపా అందరం మహమ్మాయం....మాడి మసైపోతాం ..యీ కుక్కుట హోమానికి యీ దారుణమారణ కోళ్ళ గుండానికీ అంతం లేదా.... మా కోళ్ళజాతికి మనుగడలేదా.... పంజాలు ముడుచుకి చుంచులు మూసుకుని కూచోడవేనా....

# MARRIED LOVE
## లేక
## పెళ్ళి ప్రేమ



ప్రతి సాయంత్రం
ఆత్రంగా గేటు దగ్గరే
ఎదురొస్తూంది మా ఆవిడ
పాపం! పోపులు కలవని కూరలా కురులు చెదిరి
అస్తవ్యస్తపు టాలోచనల్లా బట్టలు నలిగి
నేరుగా వంటగది నుంచి—
తీరని ఆకల్లా అమ్మాయిలు
గేటు అకుల్ని వేళ్ళాడుతూంటే
నా పాతకారు లోనికి దూసుకుపోతూంది
అంతలోనే నా నంచీ
లంచిబుట్టా మా అమ్మాయిల
హస్తాల నలంకరిస్తాయి
హమ్మయ్య! ఆ రోజు పని ముగిసి
కమ్మగా యిల్లు చేరినట్టే
అవునుగదూ
రోజంతా వీళ్ళని మరిచేపొయ్యా
అయితే యిప్పుడే హఠాత్తుగా గుర్తొస్తున్నది
మళ్ళీవాళ్ళని హతాకుల్ని చెయ్యాలి!
అర్థరహితమైన పానశాలా ప్రస్థానానికి
ఆ సాయంత్రా న్నింతకుముందే వాగ్దానం చేశాను.
శ్రీమతి అందించిన కాఫీలోని వెచ్చదనం
నా అచేతనపుటూహల్లో చప్పగా చల్లారిపోయింది
అమ్మాయిల పాతశాలా గాథల మధుర వాక్సుమాలు
నా చెవుల్లో సీసపు ముద్దల్ని తాకి సోలిపోతున్నాయి
దూరంగా వాళ్ళు.దూరదూరంగా నేను
వెదుకుతున్న చేతులే చీకట్లో దగ్గర
రాగభావనా జలతరంగాల్ని వెనక్కినెట్టి
ప్రవాహంతో ముందుకు పోవాలి
ఈ రాత్రి కూడా వారిని నిరాశలో ముంచాలి!

ఆంగ్ల మూలం: శ్రీనివాస్ రాయప్రోలు
అనువాదం: 'అపార'

యిలా బలై పోవలసిందేనా.... యిదే నా బాధ.... యీ ఆవేదనే.... యీ అగ్గి పెగే నా నెత్తిమీద నూనూగు జుత్తు.... కంటికి కునుకు రావడంలేదు.... ఆలోచించండి.... ఏం చేదాం?" రెండు వంకాలతో గంపని దిగనొక్కుతూ గంపగళ్ళలోంచి ముక్కుతో పొడుస్తోంది.

"మొదలు చెడే వేళ కుక్కమూతి పిందెలు పుట్టుకొస్తాయంటారు.... జూలు పెరిగినా, జుత్తు మొలిచినా.... మొద్దుబారిపోయేం.... నువ్వే దారి చూపించాలి.... ఏం సాధనం" కుయ్యో మొర్రోమన్నాయి కోళ్ళన్నీ.

రెక్క లెగరేస్తూ వెక్కిరిస్తున్నాయి పిల్లకోళ్ళు. గంపలో చిక్కుకున్న కోళ్ళ వేపు దిగాలు పడి చూస్తున్నాయి.

"కుక్కుక్కుక్కూ.... పిల్ల కాకికేం తెలుసు వుండేలు దెబ్బ...." రుస రుసలాడింది పెట్ట.

"పదికాలాలపాటు మనం హాయిగా బతకాలని.... యీ గంపనిలా అదిమి పట్టి కావలాకాస్తున్నాను. కట్టుకుపోతానా- వున్నదంతా తరతరాలుగా మీకే ధారపోసేం. యీ గంపేం చేసుకుంటాను. మీ కోసమే యీ యాతనంతా. నాకా వయసు వాడుబడుతోంది సత్తువ సడలుతోంది. యింకా యెన్నాళ్ళని కాయగలను చెప్పండి? యీ గంప కింద యెవరున్నారో చూసేరా?"

"ఎవరూ? .... మన వాళ్ళలాగే వున్నారు?" అన్నాయి పుంజులు.

"మనవాళ్ళా?.... చూపు మందగించిందా.. బుద్ధి మొద్దుబారిందా.. సరిగ్గా చూడండయ్యా.. రెక్కలూ జూలూ యీకలూ మనవే.. ఆ తొడుగుల అడుగున చూడండి. డేగలు.. రాబందులు.. గెద్దలు..మాల కాకులు.. మనవాళ్ళే వాళ్ళ కూతలు పట్టేరు.. మన కూతల అర్థాలే మార్చేస్తున్నారు.. పాముల పుట్టలు తేళ్ళ పుట్టలు.. అందుకే యిలా మూతవెట్టేసేను" కసికసిగా కూసింది.

"మంచి పన్జేసేవు.. ఏం చేసేరు వీళ్ళు?" అన్నాయి గుంపులు పుంజుల కళ్ళన్నీ గంపమీదే వున్నాయి.

వెయ్యికళ్ళ గంపలోంచి వెయ్యికళ్ళెట్టుకు చూస్తున్నాయి. మూత బిడ్డ కోళ్ళు- రెక్కలాడించి యెగరాలని పుడిలాటపడుతున్నాయి.

"ఏం చేస్తున్నారా.. తెగుళ్ళు రేకెత్తిస్తున్నారు.. దుమ్మూ ధూళీ రేపుతున్నారు. మహమ్మారిని చూపించి బెంబేలెత్తిస్తున్నారు. బెదిరించి సంబరాలుచేస్తున్నారు. మన పీకలే తెగేసి.. పీనుగుల కష్టాలకు మొలేసి..మందిగల్లో మన రక్తాన్నే చిక్కబట్టి అమ్మవారికి దాంతో తలంటిపోస్తున్నారు. యింకా చెప్పమంటారా చాలా?"

"ఎంత ద్రోహం ఎంత ద్రోహం. విశ్వాసఘాతకుల్లారా. యిలా మాలోనే వుంటూ వెన్నుపోటు పొడుస్తారా చీడపురుగులు...."

అందుకే పెంటకుప్పల్లో ఏరిపారేస్తున్నాం" అన్నాయి పెట్టలు.

"ఓటలుండండేసి ఎర్రిమొకాల్లారా. ఏటి తెల్దా" అందో ముసిలి పుంజు.

"అమ్మనాయనో ఏం దారితల్లీ. నువ్వే సూడాల నేకపోతే మా దారి గోదారే" గొల్లుమన్నాయి కోళ్ళన్నీ.

గజగజలాడిపోతున్నాయి పెద్ద కోళ్ళు. కళ్ళువిప్పుతున్న పిల్లకోళ్ళు పట్టలేని

ఉ(క్రోషంతో మండిపడుతున్నాయి. విప్పుతున్న కళ్ళు రువరువ రాజుకుంటున్నాయి.

సయమం చూసింది యిదే అదునను కుంది "కుక్కురోకో. కొక్కురోకో." చివ్వన చువ్వలా మెడెత్తికూసింది.

కుంకుతున్న గుడ్డివెలుగు జడుసుకుంది. "అడిగేరుగనుక చెప్తున్నాను నాకడుపుకాసినవి రెండే పుంజులు మీకెరుగుదురుగదా"

కుక్కుకుక్కు అందికోళ్ళమంద.

"ఓ వెర్రిముండ గుడ్డులోంచే దేగలతో పందెంవేసి యెగరబోయేడు.భళ్ళున పగిలిపోయేడు.కడుపు కోతని భరించి నిభాయించుకున్నాను. ఎవరికోసం? అంతా మీ కోసం. మీరందరూ యేమైపోతారో అని కలవరపడి. అదే నా బాధంతా.... యిహ వున్నదల్లా ఒకడు. వీడికీ గాలి తిరుగుళ్ళ సరదావుంది. వద్దురా పిచ్చికూనా నేలమీద నడవరాబాబూనాయనా అనినచ్చచెప్పేను. దారికొస్తున్నా డిప్పుడిప్పుడే. నేలమీద విద్దెం చేస్తున్నాడు. అదేమనకి అద్భనం. ఏవంటారు? అవునా?" రెట్టించింది పెట్ట.

"నేలమీదే! మీ ముద్దుల పుంజు నడవడవా. ఎంతాశ్చర్యం!"

విస్తుపోయి చూస్తోంది గుంపు. అందుకుంది పెట్ట

"మా ఆదిపుంజుగారి దివ్యజ్ఞానాన్ని పుంజుకుని మరీపుట్టేడీ పుంజు నాగమ్మ. మాతాతగారి లోకజ్ఞానం. రాకాసిని రక్తం కక్కించిన మాముత్తాత గుండెబలం కండబలం అన్నీ కలబోసి పోతపోసి మరీ "కొక్కురోకో" అంటూ మరొక్కమారు కూసింది.

కళ్ళంమధ్య గుర్రు పెడుతున్నాడు వాచిమేను.

పిల్లకోళ్ళన్నీ గుంపులు గుంపులుగా చేరి గుసగుసలాడుకున్నాయి. గునగునలాడుతూ నులకమంచంచుట్టూ చేరేయి. కొన్ని మంచంమీదకెగిరి దుప్పటిమీద గెంతడం మొదలెట్టేయి.మరికొన్ని వాచిమేను చెవిలో పొడవడం గొణగడం ప్రారంభించేయి.

తుళ్ళిపడి లేచేడు వాచిమేను.ఆవులించి కళ్ళునులుముకుంటూ లేచేడు.

"కొక్కురోకో..కొక్కురోకో"గంపమీదకోడి తెగకూస్తోంది.

గుంపులు గుంపులుగా కోళ్ళు గొణగొణ లాడుతున్నాయి.

"మీ తల్లి సిగ్గొయ్యా. ఏల కాని ఏల. మీకేం తెగులొచ్చిందే." ఆవులిస్తున్నాడు వాచిమేను.

"కుక్కులోకో. కుక్కుకుక్కు" గంపమీద పెట్ట కూతపెంచింది.

"నీయవ్వా. గొలకన కోడి. పుట్టినకాణ్ణించి సూస్తన్నాను నీ యవ్వారం.... నక్కకూతా పీతనడకా. బంగారం నాంటి నిద్దర సెడగొట్టినావుగందే." తిట్టుకుంటూ మంచానికి జారేసిన చాపాటి కర్రతీసి సాచి గురిచూసి గంపమీదకి విసిరేడు.

తుప్పున తుళ్ళిపోయి మట్టి కరిచింది పెట్ట. గంప తిరగబడిపోయింది. మూతబడ్డకోళ్ళన్నీ రెక్కలెగరేసి చివ్వన తారాజువ్వల్లా పైకెగిరేయి.

గుమిగూడిన కోళ్ళన్నీ రెపరెపలాడుకుంటూ ఎగురుకుంటూ గెంతుకుంటూ చెల్లాచెదురైపోయేయి.

కొండవార నెలవంక వెలవెలబో యింది.

కాకులు కూస్తున్నాయి. నోట్లో వెచ్చగా అడ్డపొగపెట్టుకుని మళ్ళీ ముసుగుదన్నేడు వాచిమేను.

తెల్లారింది. కళ్ళవంతా పోగులు పోగులుగా యీకలెగురుతున్నాయి. కోళ్ళన్నీ మామూలుగా మళ్ళీ పెంటకుప్ప లెక్కి పురుగులేరుకుంటున్నాయి.

వాచిమేను వెళిపోయేడు.

మా వేసింది. అటూయిటూచూసింది. అదునుకాసి చెంగున యెగిరి మళ్ళీ గంపెక్కింది పెట్ట.

"కొక్కురోకో.కొక్కురోకో.కొక్కురోకో."

పొద్దు పొడుస్తోంది. సూర్యుడు సూరేకారం జల్లుతున్నాడు. సూదులు దూస్తున్నాడు.

"వీడి పణంపడా.. తెగ మిడిసిపడుతున్నాడు సూరీడు.. మనకూత మంత్రంతో బయటపడి మనమీదే నిప్పులూస్తున్నాడు. వీడిపొగరణచాలి....క్కుక్కుక్కూ...." కుయ్యడం కొనసాగించింది పెట్ట.

కోళ్ళన్నీ మళ్ళీ గుమిగూడుతున్నాయి.

"నీ పుంజుని గంపెక్కించెయ్ తల్లీ అన్నాయి ముసిలికోళ్ళు.

"వాడెక్కొద్దూ...."

"మేం ఒప్పిస్తాం" అన్నాయి జులాయిగా తిరిగే నడివయసు కోళ్ళు.

"నాడెవ్వైన పుంజు.. మేం బతిమాలుకుంటాం.." అన్నాయిపెట్టలు.


బతుకాయరోటా.బలులూ.సంబరాలూ ఎన్నాళ్ళని యీ రక్తదానం.."

కృతికలిపేయి టర్కీలు, ఎర్రకోళ్ళు కక్కేలూ.

"కుక్కుకుక్కు.. మీ రంతాకావాలంటే నేనెవర్నీ..ఆ పుంజుని మీ కోసవేకన్నాను మీకే దత్తంచేస్తాను. మీకోసవేమీకోసవే.. కుక్కు.. కొక్కురోకో.."

గంపమీద పదిలంగా నిలబడింది పెట్ట.

నడిపొద్దెక్కింది. మిడిసిపడి మిసమిసలాడే ఆకాశదీపాన్ని రాహువుమింగేసేడు.



మిట్టమధ్యాహ్నం. కటిక చీకటి కమ్ము కుంది. కరకాక్కాయి సిరావాలిగిపోయింది.

"చూసేరాచూసేరా.. మనవంతా ఒక్క సైతే.. ఒక్క కూతలో యీ సూరేదు మాడి మసైపోయేదుయిప్పటికేనా గ్రహించేరా.. కూత సత్తువా?" అంది చమత్కారంగా.

"ఓరి.. ఎంత జీతులు మారిరా బాబూ. గ్రహణంపడితే అదే తవకూత బలవేనట. యీకాకమ్మ కధలూ పుక్కిటి రాణాలూ చెబుతున్నానే యీ గంప మీద ఏలుబడి చేస్తోంది.

తెల్లబోతూ బురబురలాడుతున్నాయి రెక్కలు పెంచుతున్న పిల్లకోళ్ళు వంజాలు విప్పుతున్నాయి.

ఓరకంట చూస్తోంది పెట్ట. కోరగా కవి పెడుతోంది.

"కొక్కురోకో.... కుక్కుక్కు...." గురగురలాడింది.

"వాడిమేనేవన్నాడో విన్నారా" ఓపిల్ల కోడి ముందుకొచ్చింది.

"పుట్టగానే పీతలా నడిచిందట" మరోటి మాట కలిపింది.

"క్రూక్‌వాక్" అందొకటి.



"అదేం కూత. కొత్తకూత" అన్నాయి పెంకికోళ్ళు.

"వాళ్ళ నాన్న పెట్టిన పేరు"

"కృకవాకం కదూ"

"అదే కుదించేను అంతే."

"అంటే"

"మరేం లేదూ. అదేదో భాషలో క్రూక్ అంటే వంకర. వాక్ అంటే నడక. అంతే.

"నక్క జాతలేనా పసిగట్టగలంకాని దీని జీతులూ ఎత్తులూ కూతలూ పట్టు బడవు. క్రూక్‌కాక్ క్రూక్‌వాక్".

"క్రూక్‌వాక్ క్రూక్‌వాక్ క్రూక్‌వాక్" భంగు తాగినట్టు తూలుతూ తుళ్లుతూ గిరికీలు కొట్టడం కూతలు కుయ్యడం మొదలెట్టేయి పిల్లకోళ్లన్నీ.

కోళ్ళ గుంపు బిక్కు బిక్కు మని చూస్తోంది.

చువ్వన మేను వంచింది. తోక విదిలించింది. మెడలు రిక్కించింది. కాలుదువ్వుతోంది. రెక్కలు రెపరెప లాడిస్తోంది. వంజాలు విప్పి గంపని రక్కుతోంది.

"కుక్కురోకో .... కుక్కురోకో.... కుక్కురోకో .... కుక్కుక్కుకూక్కు...."

కసిగా కొవ్వెక్కి ఒళ్ళంతా తిమ్మి రెక్కిగొంతు చించుకుని గింజుకుంటోంది కోడి.

కూస్తోంది.

"కొక్కురోకో....కొక్కురోకో...."

పేగులు తెగేలా తెగ కూస్తోంది.

